క్లుప్తంగా

గ్రామాల్లో ఉపాధిహామీ సోషల్ ఆడిట్ గ్రామసభలు

ప్రత్తిపాడు: గ్రామాల్లో ఉపాధిహామీ సోషల్ ఆడిట్ గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ఏడుకొండలు తెలిపారు. గ్రామాల్లో జరిగిన ఉపాధిహామీ పనులకు సంబంధించి మండలంలోని పదహారు గ్రామ పంచాయతీల్లో జరిగిన 540 పనులకు సంబంధించి ఈ నెల 22 వరకు ఎస్ఆర్‌పి అవులయ్య ఆధ్వర్యంలో డీఆర్పీలు సామాజిక తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు. సోషల్ ఆడిట్ ముగిసిన అనంతరం 18వ తేదీన కొత్తమల్లాయపాలెంలో, 19న యనమదల, గొట్టిపాడు, పాత మల్లాయపాలెం, వంగిపురం గ్రామాల్లో, 20న నడింపాలెం, తుమ్మలపాలెం గ్రామాల్లో, 21న నిమ్మగడ్డవారిపాలెంలో, 22న తిక్కిరెడ్డిపాలెంలో, 23న కొండేపాడు, మేడావారిపాలెం, ఈదులపాలెం గ్రామాల్లో, 25న గనికపూడి, కోయవారిపాలెం, తిమ్మాపురం, ప్రత్తిపాడు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తారని చెప్పారు. ఉపాధిహామీకూలీలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఏపీవో కోరారు.

ఢిల్లీలో అవార్డును అందుకున్న తుమ్మపాలెం సర్పంచ్



ప్రత్తిపాడు: తుమ్మపాలెం సర్పంచ్ చల్లా నాగమలేశ్వరి ఢిల్లీలో అవార్డును అందుకున్నారు. హర్ ఘర్ జల్, ఓడీఎఫ్ ప్లస్ కార్యక్రమాల పనితీరు బాగుండటంతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొని అవార్డ్ ను అందుకోవాలని భారత ప్రభుత్వం నుంచి ఆహ్వానం అందిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీలో సర్పంచ్ నాగ మల్లేశ్వరికి మినిస్ట్రీ ఆఫ్ జలశక్తి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ డ్రింకింగ్ వాటర్ అండ్ శానిటేషన్ శాఖల అధికారులు అవార్డును అందించారు. ఢిల్లీలో అవార్డును అందుకోవడం తనపై బాధ్యతను మరింత పెంచిందని, ఇది అధికారులు, ప్రజల సహకారంతోనే సాధ్యమైందని హర్షం వ్యక్తం చేశారు.

నీటి తీరువా వేగవంతం చేయాలి

కాకుమాను: ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న దృష్ట్యా నీటి తీరువా వేగవంతం చేయాలని తహసీల్దార్ బి.వెంకటస్వామి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 11 రెవెన్యూ గ్రామాలు ఉండగా ఇప్పటి వరకు కేవలం నాలుగు గ్రామాలలోనే నీటి తీరువా పూర్తయినట్లు మిగిలిన గ్రామాలలో కూడా ఈ నెలాఖరు లోపు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. వీఆర్వోలు, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు సమన్వయంతో పనిచేసి అన్నదాత సుఖీభవ, కౌలు రైతులను గుర్తించి వారందరికీ సీసీఆర్సీ కార్డులు మంజూరు చేయాలని ఆయన సూచించారు. బియ్యం కార్డులను ఈకేవైసీ పూర్తి చేసి లాగిన్ నుండి ఫార్వార్డ్ చేయాలని ఆయన తెలిపారు. విధి నిర్వహణలో ఎవరైన అశ్రద్ధ వహిస్తే అటువంటి వారిపై తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో కార్యాలయ సిబ్బంది,వీఆర్వోలు ఉన్నారు.

మెరిట్ స్టూడెంట్స్‌కు ఆర్థిక సాయం

గుంటూరు రూరల్: మండలంలోని వెంగళాయపాలెం గ్రామంలోగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీజె మణికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ చేసి జెండా వందనం చేశారు. కార్యక్రమంలో భాగంగా గోగినేని వెంకటేశ్వర్లు ఆయన భార్య గోగినేని చిన్నమ్మ జ్ఞాపకార్థం 2024-25 విద్యా సంవత్సరంలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ 10 వేలు, రూ 8 వేలు, రూ 6 వేల రూపాయలు గ్రామ సర్పంచ్ లలితకుమారి చేతుల మీదుగా అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయురాలు రంగమ్మ తెలుగులో 90 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులు 13 మందికి వెయ్యిరూపాయల చొప్పున, వైవి శ్రీనివాసరావు ఇంగ్లీషులో 90 మార్కులకు పైగా సాధించిన ముగ్గురు విద్యార్థులకు వెయ్యిరూపాయల చొప్పున, అక్రమున్నీసా సాంఘీక శాస్త్రంలో 80 మార్కులకు పైగా సాధించిన 14 మందికి రూ 2 వేల చొప్పున బహుమతిగా అందజేశారు. వెల్లంకి నాగరాజు తన తండ్రి వెల్లంకి సుబ్బారావు జ్ఞాపకార్థం రూ 21300లతో మైక్ సెట్‌ను బహుమతిగా అందజేశారు. విద్యార్థుల ఉన్నతికి కృషిచేసిన ప్రతి ఒక్కరికి పాఠశాల ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేసిన అతిథులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులు

పెదకాకాని: పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులు షేక్ రిజ్వానా, జి.హ్యామల, ఎ.జాహ్నవిలకు నగదు బహుమతులు అందజేశారు. పెదకాకాని జిల్లా పరిషత్ పాఠశాల 1988-1989 టెన్త్ క్లాస్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పది పరీక్షల్లో 591 మార్కులు సాధించిన షేక్ రిజ్వానాకు 2500 రూపాయలు, 571 మార్కులు సాధించిన జి హ్యామలకు 2000 రూపాయలు, 563 మార్కులు సాధించిన ఎ.జాహ్నవికి 1500 రూపాయలు చొప్పున నగదు బహుమతులు అందజేశారు.



జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న న్యాయమూర్తి పవన్‌కుమార్



స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు



పెదకాకానిలో జెండా వందనం చేస్తున్న తహసీల్దార్ కృష్ణకాంత్



విజా, వీవీఐటీ విశ్వవిద్యాలయంలో జెండా వందనం చేస్తున్న చాన్స్‌లర్ వాసిరెడ్డి విద్యాసాగర్

మురిసిన మువ్వన్నెల రెపరెపలు

ఊరూరా అంబరాన్నంటిన స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు

ప్రత్తిపాడు: మువ్వన్నెలు మురిశాయి. త్రివర్ణ పతాకరం ఊరూరా రెపరెపలాడింది. తాగధనుల కీర్తిని స్మరించుకున్నారు. మహనీయుల బాటలో పయనిద్దామంటూ ప్రతినబూనారు. నియోజకవర్గ వ్యాప్తంగా 79వ స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, కార్యాలయాల్లో త్రివర్ణ పతాకం సగర్వంగా నింగికెగసింది.

- ప్రత్తిపాడులోని సీపీఐ కార్యాలయంలో నియోజకవర్గ కార్యదర్శి రామిశెట్టి ఆదేశ్వరరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు.
- నాగులపాడులోని మార్కెట్ యార్డులో చైర్మన్ బి.అమరేశ్వరి యార్డు డైరెక్టర్లుతో కలిసి జెండాను ఎగురవేసి, మిఠాయిలు పంచిపెట్టారు.
- ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్తిపాడులోని వేణుగోపాలస్వామి ఆలయం పక్కన ఉన్న స్వాతంత్ర్య సమరయోధులు అమరజీవి పొట్టి శ్రీరాములు, బాపూజీ, జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహాలకు ఆర్యవైశ్య సంఘ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.
- ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దాసరి అన్నమ్మ ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ ఆదం షఫీ, ఎంఈవో సీహెచ్ రమాదేవి, ఆయా శాఖల అధికారులతో కలిసి జెండా ఆవిష్కరించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుజాత కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలతో కలిసి జాతీయ జెండాను ఎగురవేశారు.

కిట్స్ కళాశాలలో..

వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎన్‌సిసి విద్యార్థులు చేసిన కవాతు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులకు రకరకాల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కళాశాల సెక్రటరీ కోయి శేఖర్, ప్రిన్సిపల్ డాక్టర్ పి. బాబు, అకడమిక్ డైరెక్టర్ డా.కె. హరిబాబు పాల్గొన్నారు.

మిట్టపల్లి కళాశాలలో..

తుమ్మలపాలెం మిట్టపల్లి ఇంజినీరింగ్ కళాశాలలో పంద్రాగస్టు వేడుకలు జాతీయ సేవాసమితి, ఫిజికల్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో జరిగాయి. హాజరైన కళాశాలల సెక్రటరీ ఎం.బి.వి సత్యనారాయణ జెండాను ఆవిష్కరించారు. స్వాతంత్ర్య సమరయోధులను మనం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్. గోపీకృష్ణ, ఏవో సీహెచ్. శ్రీనివాసరావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.ఎస్.కె. ప్రసాదరావు, ఉమెన్స్ కళాశాల ప్రిన్సిపల్ కె. సుధాకర్, ఎన్ఎస్ఎస్ పీవో రాజాకుమార్, పీడీ పి. వెంకటేష్ పాల్గొన్నారు.

విజ్ఞాన్‌లో ...

గుంటూరు రూరల్: విజ్ఞాన్ పలకలూరు ప్రాంగణంలో శుక్రవారం ఘనంగా 79వ స్వాతంత్రదినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ సుస్మిత జాతీయ పతాకావిష్కరణ చేశారు. అనంతరం జాతీయ గీతాలాపన చేశారు. వేడుకలలో విజ్ఞాన్ స్కూల్, విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల, విజ్ఞాన్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థుల పిరమిడ్ విన్యాసాలు, ఎన్‌సీసీ క్యాడెట్ల పేరెడ్లు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యా సంస్థల సీఈఓ డాక్టర్ లావు మేఘన మాట్లాడుతూ విద్యార్థులంతా క్రమశిక్షణతో సరైన జీవనశైలితో తమ జీవితం స్వతంత్రంగా జీవించాలని ఆకాంక్షించారు. డాక్టర్ సుస్మిత మాట్లాడుతూ ప్రతి ఒక్కరు చక్కని విద్యతో, ఉన్నత విలువలతో పైకిఎదగాలని కోరారు. విజ్ఞాన్ డిగ్రీ కళాశాల, స్కూల్ విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విజ్ఞాన్ నిరుల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాధిక, డిగ్రీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.అనురాధ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వై. వెంకటేశ్వరరావు, విజ్ఞాన్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.మల్లికార్జునబాబు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చౌడవరంలో....

గుంటూరు రూరల్: భారత స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయులని స్మరించుకో



పొన్నూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న అంబటి మురళీకృష్ణ



విజ్ఞాన్‌లో జెండా ఆవిష్కరణ చేస్తున్న అధ్యాపకులు, కళాశాల యాజమాన్యం

వడం మన కర్తవ్యమని చేతన కార్యనిర్వాహకురాలు మరుద్వతి తెలిపారు. చౌడవరం గ్రామంలోని శ్రీవెంకటేశ్వర బాలకుటీర్, చేతనలో శుక్రవారం 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో మరుద్వతి, ప్రిన్సిపల్స్ డాక్టర్ యం.డి. నస్రీన్, మల్లిఖార్జునరావు, వెంకటేశ్వరరావు, పద్మజ, లక్ష్మిప్రసన్న, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగఫలితమే స్వాతంత్ర్యం

పొన్నూరు: ఎందరో మహనీయుల త్యాగఫలితమే మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యమని వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. నియోజకవర్గంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కొన్ని పాఠశాలల ఆధ్వర్యంలో దేశనాయకుల వేషధారణలతో పురవీధుల్లో నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

- పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంబటి మురళీకృష్ణ జాతీయ జెండాను ఆవిష్కరించి మహనీయుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యులు షేక్. సైఫుల్లా, ఎంపీపీ భవనం పద్మలీల, అధికార ప్రతినిధి ఎండేటి వెంకట సుబ్బయ్య, నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆకుల వెంకటేశ్వరరావు, యువజన అధ్యక్షులు చుండూరు వీరయ్య, యువజన విభాగం సంయుక్త కార్యదర్శి అమిరినేని సాంబశివరావు, మండల పార్టీ అధ్యక్షులు చింతలపూడి మురళీకృష్ణ, మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్. మౌలాలి, దివ్యాంగుల విభాగం అధ్యక్షులు ఎస్. ఈశ్వరయ్య, మహిళా విభాగం అధ్యక్షురాలు మరియారాణి, నాయకులు షేక్. నాజర్, ఆర్. ఆదిశేషు, అంబటి వెంకటేశ్వరరావు, గేరా సంజీవ్, మూర్తిరాజు, రమేష్, దేవరకొంగ గోపి, మోహనరావు, మంద్రు అనిత, సుషోబిత, కార్యకర్తలు పాల్గొన్నారు. అగ్నిమాపక కేంద్రంలో అధికారి ప్రసాదరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టులో..

ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టు భవనంలో మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, న్యాయమూర్తి ఏకా. పవన్‌కుమార్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. న్యాయమూర్తి పవన్‌కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పి. జయరాజ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ వర్సిటీలో...

చేబ్రోలు: మండల పరిధిలోని వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీ, లారా ఇంజినీరింగ్ కళాశాల, ఫార్మసీ, జూనియర్ కళాశాలల ఆధ్వర్యంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పంద్రాగస్టు వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు యుద్ధాల్లో వీర మరణం పొందిన సైనికులకు నివాళిగా ఏర్పాటు చేసిన అమర్ జవాన్ స్థూపానికి ముందుగా నివాళులర్పించి జ్యోతి వెలిగించారు. విద్యార్థులు జాతీయ జెండాతో నిర్వహించిన ర్యాలీ, ఎన్‌సీసీ పరేడ్ ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం వారం రోజుల స్వాతంత్ర్య దినోత్సవ ఉత్సవాల్లో భాగంగా వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఇంచార్జి రిజిస్ట్రార్ డీ.విజయరాము, మాజీ డీజీపీ మాలకొండయ్య, పి.శ్రీనివాసబాబు, కే.ఫణీంద్ర కుమార్, డీన్లు తదితరులు పాల్గొన్నారు.

సిబార్‌లో ...

పెదకాకాని: యువత మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని ఆ దిశగా అడుగులు వేయాలని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ డీన్ డాక్టర్ రంజిత్ తాప అన్నారు. పెదకాకాని మండలం తక్కెళ్ళపాడు సిబార్ దంత వైద్య కళాశాలలో శుక్రవారం స్వాతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ఆర్ఎం యూనివర్శిటీ డీన్ డాక్టర్ రంజిత్ తాప విచ్చేసి జాతీయ జెండా ఎగురవేసి జండా వందనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఎం డీన్ రంజిత్ మాట్లాడుతూ దేశం ఆర్థిక స్వావలంబన దిశగా నడవాలని దానికి విశ్వవిద్యాలయాలు పరిశోధనలు నూతన ఆవిష్కరణలను చేయాలన్నారు. యువత పూనుకుంటే భారతదేశం ప్రపంచంలోనే గొప్ప ఆర్థిక పటిష్టత కలిగిన దేశంగా ఎదుగుతుందన్నారు. దంత వైద్య రంగంలో సిబార్ దంత వైద్య కళాశాల చేస్తున్న కృషిని కొనియాడారు. సిబార్, ఎస్ఆర్ఎం సంయుక్తంగా దంత వైద్య ఆరోగ్య రంగంలో నూతన ఆవిష్కరణలపై పరిశోధన చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిబార్ డైరెక్టర్ డాక్టర్ టి.కృష్ణమోహన్, ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటరమణారెడ్డి, వైస్ డీన్ డాక్టర్ నగేష్, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

పెదకాకానిలో...

పెదకాకాని: ఎందరో మహనీయుల త్యాగ ఫలితమే నేడు మనం జరుపుకునే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కామినేని శ్రీనివాసరావు అన్నారు. పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ మహనీయులు అనేక పోరాటాలు, ప్రాణ త్యాగాలు చేసి మనదేశం నుంచి విదేశీయులను తరిమికొట్టారన్నారు. అలాగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, పంచాయితీ కార్యాలయాలు, దేవదాయశాఖ రాష్ట్ర ట్రిబ్యునల్, పోలీసుస్టేషన్, తహసీల్ధార్ కార్యాలయం, రిజిస్టార్ కార్యాలయం, పెదకాకాని శివాలయం నందు జాతీయ జెండా ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు షేక్ షహనాజ్, పెండ్యాల మాధవి, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసరావు, ట్రిబ్యూనల్ సభ్యుడు తెనాలి చంద్రకుమార్, ఏఓ చంద్రమౌళి, తహసీల్దార్ కృష్ణకాంత్, సీఐ టీపీ నారాయణ స్వామి, పంచాయతీ కార్యదర్శులు, ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజా, వీవీఐటీ విశ్వవిద్యాలయంలో..

పెదకాకాని: విజా, వీవీఐటీ విశ్వవిద్యాలయంలో 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విజా, వీవీఐటీయూకు చెందిన ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, క్రీడా విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం త్రివర్ణ పతాకాలతో నిర్వహించిన ప్రదర్శన, ర్యాలీ ఆకట్టుకుంది. వీవీఐటీ విశ్వవిద్యాలయం చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం విజా, వీవీఐటీయూ ఎన్‌సీసీ విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వీవీఐటీ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ కొడాలి రాంబాబు, విజా డైరెక్టర్ లెఫ్టినెంట్ కమాండర్ (రిటైర్డ్) కె.శ్రీనివాసరావు, వీవీఐటీ ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జున రెడ్డి, విజా ప్రిన్సిపల్ సి.హెచ్.సరళ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జూనియర్ విజా హెడ్ మామిళ్లపల్లి వేదవాణి, ఐబీ ప్రోగ్రామ్ కోర్డినేటర్ మాధవి, కళాశాల ఎన్‌సీసీ అధికారులు బిబన్ బాషా, ఆళ్ల శ్రీవాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కళ్ళం ఇంజనీరింగ్ కళాశాలలో...

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని చౌడవరం గ్రామంలోగల కళ్ళం ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి జాతీయ పతాక ఆవిష్కరణ చేశారు. మన దేశ ప్రగతికి సోపానాలు వేయాలని దేశాభివృద్ధిలో కళ్లం ఇంజనీరింగ్ కళాశాల సభ్యులందరూ తమ వంతు కృషి చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వివిధ విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యపకేతర బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో ..

గుంటూరు రూరల్: మండలంలోని చౌడవరం గ్రామంలోగల ఆర్‌విఆర్‌జెసి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఏపి ట్రాన్స్ కో గుంటూరు, ఎక్సిక్యూటివ్ ఇంజనీర్ చిలుకూరి వాసు ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. ఎన్.సి.సి.విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించి, జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో మహనీయుల ప్రాణ త్యాగ



వింజనంపాడులో జెండాకు సెల్యూట్ చేస్తున్న కిట్స్ చైర్మన్ కోయి సుబ్బారావు



ప్రత్తిపాడులో జెండా ఎగరవేస్తున్న తహసీల్దార్ సుజాత

ఫలితంగానే స్వాతంత్ర సాధన జరిగిందని, అన్ని రంగాల్లో భారతదేశం ఆర్థిక అభివృద్ధి సాధించినప్పుడే స్వాతంత్రోద్యమ కారుల ఆశయాలకు సరైన నిర్వచనం లభిస్తుందన్నారు. ప్రస్తుతం డిజిటల్ యుగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. దేశ ప్రగతే లక్ష్యంగా బానిసత్వ విముక్తి, స్వపరిపాలన కోసం ఎందరో మహనీయులు బ్రిటీష్ వారిపై పోరాడి ప్రాణ త్యాగాలు చేశారని, వారిని స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. నవ భారత నిర్మాణానికి విద్యార్థులే కీలక ఆధారమని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రజరర్ డాక్టర్ కె కృష్ణప్రసాద్‌లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్‌లో..

గుంటూరు రూరల్: మండలంలోని గోరంట్ల గ్రామంలోగల సెయింట్ ఆన్స్ మహిళా కళాశలలో శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రెవరెండ్ సిస్టర్ డాక్టర్ టి సంధ్య జెండా ఆవిష్కరణ చేసి స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్జీరంగా వర్సిటీలో ..

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంఫాం నందున్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మిదేవి 22వ ఆంధ్రాబెటాలియన్, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఆనంతరం స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు, శాస్త్రవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.

కాకుమానులో...

కాకుమాను: మండలంలోని గ్రామాలలో శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ బి.వెంకటస్వామి జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతూ నేడు సమాజంలో మనం స్వేచ్ఛగా జీవించానికి కారణం ఎందరో మహనీయుల త్యాగఫలమేనని అలాంటి మహనీయులను సమాజంలో ప్రతి ఒక్కరు, ముఖ్యంగా నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు మూడు రంగుల జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ఏక్‌నాథ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎంఈఓ కార్యాలయంలో:స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓ కె.ఎఫ్. కెన్నడీ జాతీయజెండాను ఆవిష్కరించారు. ఉన్నత పాఠశాలలో:స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ గౌరు లక్ష్మీ మూడురంగుల జెండాను ఆవిష్కరించారు.

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో...



జెండా ఆవిష్కరణ చేసిన ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందినప్పుడే త్యాగాలకు సార్థకత కలుగుతుందని వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఏటుకూరు బైపాస్‌రోడ్డులోని నియోజకవర్గం కార్యాలయంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ చేసి, జెండా వందనం, జాతీయ గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులున్నారు.

కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ

ప్రతి కార్యకర్తకు వైఎస్సార్‌సీపీ ఎల్లపుడూ అండగా ఉంటుందని వైఎస్సార్‌సిపి ప్రత్తిపాడు నియోజకవర్గం ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని తురకపాలెం గ్రామంలో అనారోగ్యంతో అకాల మృత్యువాతకు గురైన కార్యకర్త శీలం వెలంగిణి పార్థివదేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆ కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసాను కల్పించారు. అదేవిధంగా ఏటుకూరు గ్రామంలో అనారోగ్యంతో ఇటీవల మృత్యువాతకు గురైన ఏటుకూరి సంజయ్ కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అదేవిధంగా గ్రామంలో అనారోగ్యంతో ఇబ్బందిపడుతున్న ఏటుకూరి ప్రదీప్‌ను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

రైతాంగాన్ని ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

- రాజధాని అభివృద్ధి పేరుతో కొండవీటి వాగు మళ్లింపు
- వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



అధ్వానంగా ఉన్న బ్రిడ్జి ఫొటోలను ప్రదర్శిస్తున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ విమర్శించారు. భారీ వర్షాలు కురిసినప్పుడు నియోజకవర్గ పరిధిలో ఉధృతంగా ప్రవహిస్తున్న కొండవీటి వాగు.. కాలనాగులా మారి రైతులను కాటేస్తుందన్నారు. వేలాది ఎకరాలు వరి పంట నీట మునిగి తీవ్రంగా నష్టపోతున్నా ప్రభుత్వంలో చలనం రావడం లేదని మండిపడ్డారు. శుక్రవారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కొండవీటి వాగు కృష్ణా కెనాల్, తుంగభద్రకు సంబంధంలేకుండా ఉండేదని, రాజధాని నిర్మించాలని ఆ ప్రాంతాల్లో ఉన్న కొండవీటి వాగు ప్రవాహాన్ని నియోజకవర్గంలోకి మరలించడంలో గుంటూరు చానల్ కట్టలు తెగిపోతున్నాయని వెల్లడించారు. గత ఏడాది గుంటూరు ఛానల్ కట్టలు తెగి గోళ్లమూడి, నంబూరు, ఉప్పలపాడు, కాకాని తక్కెళ్లపాడు, వెంకట కృష్ణాపురం గ్రామాల్లోకి పొలాలు మునిగిపోయి పంట నష్టం వాటిల్లిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. వైఎస్సార్ సీపీ అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని మండిపడ్డారు. గుంటూరు బాపట్ల, ప్రధాన రహదారి.. చేబ్రోలు పరిధిలోని కొమ్మమూరు బ్రిడ్జి పరిస్థితి అత్యంత దారుణంగా ఉందన్నారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆ బ్రిడ్జి పునర్ నిర్మాణ దిశగా ఎప్పుడు ఆలోచన చేయలేదని మండిపడ్డారు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ. 45 కోట్లు కేటాయించి పనులు ప్రారంభించిందని, అయితే కూటమి అధికారంలోకి వచ్చిన 14 నెలల నుంచి బ్రిడ్జి నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదని తెలిపారు. అధ్వానంగా ఉన్న బ్రిడ్జి స్థితి ఫోటోలను ప్రదర్శించారు. సమావేశంలో రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యులు షేక్.సైపుల్లా, ఎంపీపీ భవనం పద్మలీల, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షు లు నల్లమోతు రూత్ రాణి, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆకుల వెంకటేశ్వరరావు, పెన్షనర్స్, ఎంప్లాయిస్ విభాగం అధ్యక్షులు చిర్ర అక్కిరెడ్డి, యువజన అధ్యక్షులు చుండూరు వీరయ్య, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు మరియారాణి, మంద్రు అనిత, మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.



రైతులతో కలిసి భోజనం చేస్తున్న మురళీకృష్ణ

పంట నష్టపోయిన రైతులకు పరామర్శ

పొన్నూరు: భారీ వర్షం కారణంగా చిన ఇటికంపాడులో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించి రైతులను వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పరామర్శించారు. ఈ సందర్భంగా వారిలో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భవనం పద్మలీల, రైతులు పాల్గొన్నారు.